క్లుప్తంగా

ప్రజావాణిని వినియోగించుకోండి

బంట్వారం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రాములు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయాలని సూచించారు. సంబంధిత అధికారుల పరిశీలన అనంతరం సమస్యకు పరిష్కారం చూపనున్నామని పేర్కొన్నారు.

విద్యుత్ సమస్యలకు పరిష్కారం



పనులు పరిశీలిస్తున్న ఏఈ తదితరులు

దౌల్తాబాద్: పెండింగ్ విద్యుత్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో లోఓల్టేజీ సమస్యకు.. అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయించి పరిష్కరిస్తున్నారు. అదే విధంగా రైతులు తమ వ్యవసాయ పొలాలకు ట్రాన్స్‌ఫార్మర్లు కావాలని డీడీలు కట్టి నెలలు గడుస్తుండగా.. ప్రస్తుతం వాటిని మంజూరు చేసి, అనువైన ప్రాంతంలో బిగిస్తున్నారు. ఒరిగిన స్తంభాలను మారుస్తున్నారు. వేలాడుతున్న విద్యుత్ తీగలను సరిచేస్తున్నారు. కొనసాగుతున్న పనులను ఎప్పటికప్పుడు ఏఈ పరిశీలిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

యాలాల: పేదల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం అభినందనీయమని మాజీ ఎంపీటీసీ ఆవుటి శంకర్ అన్నారు. ఆదివారం కోకట్ గ్రామంలో తాండూరు మహాలక్ష్మీ ఆస్పత్రి ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేశారు. పలువురికి కంటి పరీక్షలు చేశారు. అనంతరం అవసరమైన మందులు పంపిణీ చేసినట్లు వైద్యురాలు స్పందనరెడ్డి తెలిపారు. ఇందులో మాజీ ఉపసర్పంచ్ కృష్ణ ఉన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పిన మాధవరెడ్డి

అనంతగిరి: జాతీయ పార్టీ బీజేపీలో ప్రముఖ వైద్యుడు రాజశేఖర్ ఆదివారం చేరారు. వికారాబాద్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాధవరెడ్డి మట్లాడారు. వైద్యుడిగా ప్రజలకు సేవలు అందించిన రాజశేఖర్.. పార్టీలో చేరడం మంచి తరుణమన్నారు. ఆయన సేవలను పార్టీ గుర్తిస్తుందన్నారు. అనంతరం డాక్టర్ మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితుడనై చేరినట్లు తెలిపారు. అందరినీ కలుపుకొంటూ పార్టీ అభ్యున్నతి పాటుపడతానని చెప్పారు. పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివరాజు, పట్టణ అధ్యక్షుడు నరోత్తంరెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు యాస్కి శిరీష, కోశాధికారి సతీష్, సీనియర్ నాయకులు పాండుగౌడ్, రాజు, అమర్ ఉన్నారు.

పెచ్చులూడి, ఇనుప చువ్వలు తేలి

- శిథిలావస్థలో వాటర్ ట్యాంక్
- భయాందోళనలో ప్రజలు



వాటర్ ట్యాంక్ దుస్థితి

బంట్వారం: శిథిలవస్థ వాటర్ ట్యాంకు ఎప్పుడు కూలుతుందో.. ఎవరికి ఏ హాని తలపెడుతుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. కోట్‌పల్లి మండల కేంద్రంలో ప్రధాన రహదారికి పక్కనే సుమా రు నాలుగు దశాబ్దాల క్రితం ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్‌ను నిర్మించారు. ప్రస్తుతం ట్యాంకు పూర్తిగా నాచుపట్టి, పగుళ్లు ఏర్పడి కూలడానికి సిద్ధంగా ఉంది. పెచ్చులు ఊడి, ఇనుప చువ్వలు వెలుపలకు కనిపిస్తున్నాయి. ట్యాంకు నుంచి నిత్యం నీరు కారుతోంది. దీంతో స్థానికులు భయపడుతున్నారు. ట్యాంకు వద్ద పిల్లలు ఆడుకుంటుంటారని, అటుగా రాకపోకలు అధికంగా ఉంటాయని ప్రజలు తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించి, ట్యాంకును పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

నిర్మాణ పనుల్లో నిర్లక్ష్యం

- కుంటలను తలపిస్తున్న కల్వర్టుల గుంతలు
- కొనసాగుతున్న వంతెన నిర్మాణం
- వాహనాల రాకపోకలకు ఇక్కట్లు



కొడంగల్-పర్సాపూర్ మధ్య కల్వర్టు నిర్మాణానికి తీసిన గోతుల్లో చేపలు పడుతున్న స్థానికులు

దుద్యాల్: మహబూబ్‌నగర్-చించోలి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో భాగంగా కొడంగల్ నియోజకవర్గంలో నిర్మిస్తున్న రోడ్లు, కల్వర్టు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఏడాది క్రితం పనులు చేపట్టినా ఏ ఒక్కటి అందుబాటులోకి రాకపోవడం గమనార్హం. నాచారం వద్ద నిర్మిస్తున్న వంతెన పనులు ఆరు నెలలుగా కొనసాగుతూనే ఉన్నాయి. కొడంగల్-పర్సాపూర్ మధ్యలో పెద్ద కల్వర్టు నిర్మాణం కోసం కొన్ని నెలల క్రితం రోడ్డును తవ్వారు. కొంత భాగం నిర్మాణం జరిగింది. కానీ ప్రణాళిక లోపంతో కూల్చివేశారు. తిరిగి నిర్మాణం చేపట్టడంలో నిర్లక్ష్యం పెనవేసుకుంది. తీసిన గోతుల్లో పూర్తిగా వర్షపు నీరు నిలిచిపోగా.. స్థానికులు వాటిల్లో చేపలు పడుతున్నారు. ఫలితంగా ప్రజా రవాణాకు తీవ్ర ఆటంకం కలిగింది.

వరుస ప్రమాదాలు

కొడంగల్-పర్సాపూర్ మధ్యలో కల్వర్టు నిర్మాణానికి తీసిన గోతి వద్ద ఇటీవల ఓ రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో వృద్ధురాలికి తీవ్ర గాయాలు అయ్యాయి. దుద్యాల్-కోస్గి మార్గంలో బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగుతున్న ప్రదేశంలో ఈ నెల 17న యువకుడు ప్రమాదానికి గురయ్యాడు. ఇలాంటి అనుకోని సంఘటనలు ఎన్నో జరుగుతున్నాయి. అధికారులు స్పందించి త్వరితగతిన నిర్మాణ పనుల్లో వేగం పెంచి, పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



దుద్యాల్-కోస్గి ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న వంతెన

మరపురాని మహనీయులు

దాశరథి, సినారే జయంతిలో వక్తలు



మాట్లాడుతున్న రిటైర్డ్ ప్రిన్సిపాల్ బందెప్పగౌడ్

అనంతగిరి: తెలుగు సాహిత్యానికి దాశరథి, సినారే చేసిన సేవలు అమోఘమని అనంత సాహిత్య సాంస్కృతిక వేదిక జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్రచార్యులు అన్నారు. ఆదివారం వికారాబాద్ సంకల్ప విద్యాపీఠం పాఠశాలలో 'అనంత' ఆధ్వర్యంలో దాశరథి, సినారే జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. తెలంగాణ, తెలుగు సాహిత్యంలోనూ వీరి సేవలు మరపురానివని కొనియాడారు. సాహిత్యం అంటే పేదవాడి ఆకలిని తీర్చేలా ఉండాలని దాశరథి చేసిన అక్షర ఆయుధ పోరాటాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో డైట్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ బందెప్పగౌడ్, ప్రముఖ వక్త పోలే విశ్వనాథం, వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశీర్వాదం, సుధాకర్‌గౌడ్, వడిచర్ల సత్యం, శీను తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధారూరు: ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మండల పరిధి కేరెళ్లి గ్రామంలో సావిత్రమ్మ మెమోరియల్ ట్రస్టు, సాధురాం కంటి వైద్యశాల సహకారంతో సత్యసాయి సార్వజనిక కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం శిబిరం నిర్వహించారు. ఇందులో 212 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 109 మందికి కళ్లద్దాలు పంపిణీ చేశారు. 37 మందికి ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. అందులో భాగంగా మొదటగా 12 మందిని శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సాధురాం కంటి ఆస్పత్రికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ట్రస్టు సమన్వయ కర్త చిరంజీవిరెడ్డి, సార్వజనిక కేంద్రం ప్రధాన కార్యదర్శి ఎం.ప్రేంకుమార్, కన్వీనర్ కె.రామకృష్ణారెడ్డి, సాధురాం కంటి వైద్యశాల సమన్వయ కర్త యాదగిరి, డాక్టర్లు భగవాన్, అజిత్, లక్ష్మణ్‌లు తదితరులు పాల్గొన్నారు.

పండ్ల తోటలకు రాయితీ..

జిల్లా ఉద్యానవన అధికారి సత్తార్



తోటను పరిశీలిస్తున్న అధికారులు

అనంతగిరి: పూల సాగు చేస్తున్న రైతులకు ఉద్యాన మిషన్ పథకం కింద సబ్సిడీ అందజేస్తామని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సత్తార్ తెలిపారు. శనివారం ఆయన వికారాబాద్ మున్సిపల్, మండల పరిధి పలు వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించారు. ఆలంపల్లిలో రైతు శేఖర్‌రెడ్డి ఆయిల్ పాం తోట, అంతర పంటగా సాగు చేస్తున్న బొప్పాయి, కొత్తగడిలో రైతు మోహన్‌రెడ్డి వంకాయ, తదితర కూరగాయల సాగు, మదన్‌పల్లిలో రైతు హన్మంతుకు చెందిన అల్లం పంట, చామంతి పూల సాగును పరిశీలించారు. తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. ఉద్యాన మిషన్ కింద కూరగాయల సాగు చేయాలనుకున్న వారికి ఉచితంగా కూరగాయల నారును సీఓఈ జీడిమెట్ల నుంచి పంపిణీ చేస్తామని రైతులకు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఉద్యానవన అధికారులు వైజయంతి, అర్చన, అక్షితరెడ్డి ఉన్నారు.

రేపు చలో హైదరాబాద్

పెద్దేముల్: పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 30న చలో హైదరాబాద్ కార్యక్రమం చేపట్టనున్నామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండల కేంద్రం పంచాయతీ కార్యాలయం ఆవరణలో కర పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమంలో పెద్దఎత్తున కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇందులో కార్మికులు అంబరప్ప, రాములు, బాలమ్మ, వెంకటమ్మ, రాసమ్మ, వీరప్ప తదితరులు ఉన్నారు.

నాగప్పను పరామర్శించిన ఎమ్మెల్యే

తాండూరు రూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కాంగ్రెస్ పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు నాగప్పను.. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి ఆదివారం గౌతాపూర్‌లోని ఆయన నివాసంలో పరామర్శించారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు

నిధులు మంజూరైనా.. నిర్మాణం ఊసేలేదు



సంగాయిపల్లి-కుదురుమళ్ల రోడ్డు దుస్థితి

దౌల్తాబాద్: మండల పరిధి సంగాయిపల్లి గ్రామం నుంచి కుదురుమళ్ల వరకు సుమారు 3కిలో మీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలం.. అందునా మట్టిరోడ్డు కావడంతో గుంతలు ఎక్కువై నీరు నిలిచి బురదను తలపిస్తోంది. సంగాయపల్లి నుంచి కుదురుమళ్లకు నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. ముఖ్యంగా విద్యార్థులు విద్యాభ్యాసానికై కుదురుమళ్లకు వస్తుంటారు. ఈ నేపథ్యంలో రోడ్డుమార్గం సరిగా లేక తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. మండల కేంద్రానికి రావాలంటే పెద్దనందిగామ గ్రామం మీదుగా అదనంగా 10కిలో మీటర్ల దూరం నుంచి వస్తున్నారు. ఈ మార్గంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు అయి నాలుగు నెలలు గడుస్తున్నా.. పనులు ప్రారంభం కాలేదు. అధికారులు స్పందించి రోడ్డు పనులు పూర్తిచేయాలని తదితర ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



వికారాబాద్ అనంతగిరి గుట్ట పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో సందర్శకులు భారీగా తరలివచ్చారు. కుటుంబీకులు, సన్నిహితులతో అడవిలో సరదాగా గడిపారు. – అనంతగిరి

సంక్షిప్త వార్తలు

◆ ఇలాంటి వారు అరుదు



దోమ: అంకితభావంతో పనిచేసే వారు చాలా అరుదుగా ఉంటారని, అలాంటి వారిలో ఒకరు జీపీ కార్యదర్శి నాయక్ అని గ్రామస్తులు కొనియాడారు. ఊటుపల్లి పంచాయతీ కార్యదర్శి లాల్యానాయక్ ఇటీవల కుల్కచర్ల మండలానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆదివారం గ్రామ పంచాయతీ ఆవరణలో నాయక్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. నాయక్ బదిలీ తమకు బాధగా ఉందని, అలాంటి వ్యక్తినే అధికారులు గ్రామానికి నియమించాలని కోరారు. ఇందులో మాజీ సర్పంచ్ నర్సింలు, మాజీ ఉపసర్పంచ్ గోపాల్, రాంచంద్రయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గోపాల్ ఉన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి విరాళం

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ టు అధ్యక్షుడు భరత్ కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శివాలయ నిర్మాణ కమిటీకి ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఇందులో రవిచందర్, ప్రకాష్, వినోద్, శంకర్, ప్రేంకుమార్ తదితరులు ఉన్నారు.

◆ పెద్దమ్మ తల్లికి పూజలు



కొడంగల్ రూరల్: ముదిరాజ్‌ల ఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లికి ఆదివారం సంఘం నాయకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆషాఢ మాసం బోనాల ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని తెలంగ్‌వాడలో ఫలహారం బండిలో ప్రతిష్ఠించిన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

◆ కోటమైసమ్మకు కోడెల బహూకరణ

కుల్కచర్ల: బోనాల పండుగ సందర్భంగా మండల పరిధి రాంపూర్‌లో ఆదివారం కోటమైసమ్మకు మాజీ ఉప సర్పంచ్ తిరుపతయ్య రెండు కోడెలను బహూకరించారు. అనంతరం ప్రజలందరూ ఆయురారోగ్యాలతో చల్లంగా ఉండేలా చూడు తల్లి అని మొక్కుకున్నట్లు ఆయన తెలిపారు.

◆ రాష్ట్ర అభివృద్ధి కోసం..

దుద్యాల్: రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పోరాటం చేస్తామని టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ అన్నారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ సార్ 13వ స్మారక ఉపన్యాస సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణ జాతిపిత కొత్తపల్లి బాటలో నడుస్తామని చెప్పారు. త్వరలో జిల్లా స్థాయి మహాసభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఇందులో టీవీవీ జిల్లా నాయకులు బాకారం చంద్రశేఖర్, గౌరారం గోపాల్, అనిల్ కుమార్, సోమశేఖర్ ఉన్నారు.

◆ కిడ్నీ బాధితులకు అండగా ఉంటాం



దోమ: కిడ్నీ బాధితులకు అండగా ఉంటానని కేఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండల పరిధి ఐనాపూర్ గ్రామానికి చెందిన వరంగల్ సాయికుమార్ కుమారుడు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న శరత్.. ఆదివారం బాధితుడిని పరామర్శించారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అందుబాటులో ఉంటానని, ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తమ దృష్టికి తేవాలని సూచించారు. ట్రస్ట్ సభ్యులు నర్సింలు, చంద్రయ్య, సారంగి, వెంకటయ్య, హన్మంతు, చెన్నయ్య, శివకుమార్, ఆంజనేయులు ఉన్నారు.

◆ కార్యకర్తలే పార్టీకి బలం

బంట్వారం: పార్టీకి కార్యకర్తలే బలం, బలగమని, వారికి అధిష్టానం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పూనంచంద్ లాహోటి అన్నారు. ఆదివారం బంట్వారంలో నిర్వహించిన పార్టీ కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో 8 ఎంపీ సీట్లు గెలిచి పార్టీ మరింత బలపడిందని తెలిపారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మెజార్టీ జీపీలను గెలుచుకునేలా పార్టీ ప్రణాళికలు రూపొందిస్తుందని, ఇందుకు కేంద్రం అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఇందులో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేశ్, గీతాసెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశంగౌడ్, నాయకులు శ్రీకాంత్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మల్లేశ్ ఉన్నారు.



అనంతగిరి: ఇందిరానగర్ కాలనీలో బోనాల ఊరేగింపు



దుద్యాల్: అలేడ్‌లో..

బోనమెత్తిన పల్లెలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఆషాఢమాస బోనాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఊరూరా గ్రామ దేవతలకు భక్తులు ఆదివారం బోనం ఎత్తారు. నెత్తిన బోనంతో పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, డప్పుచప్పుళ్ల మధ్య పురవీధుల గుండా ఊరేగింపుగా అమ్మవారి చెంతకు చేరి ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తాండూరులో కాళికాదేవి, కట్టమైసమ్మ, పోచమ్మకు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదం నియోజకవర్గ ప్రజలందరిపై ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని కోరుకున్నారు. – సాక్షి, నెట్‌వర్క్



వికారాబాద్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల



తాండూరు: కట్టమైసమ్మ ఆలయంలో ఎమ్మెల్యే



మోమిన్‌పేట: మొరంగపల్లిలో..



కొడంగల్ రూరల్: పర్సాపూర్‌లో..



తాండూరు: కాళికాదేవి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు



మర్పల్లి మండల కేంద్రంలో..



ధారూరులో..



అనంతగిరి: ఇందిరానగర్ కాలనీలో..



దోమ: బొంపల్లిలో..